జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 12 | ఫిబ్రవరి | 2026 • పేజీలు : 5






## పోలింగ్ ముగిసింది..
# వివాదం మొదలైంది..

- పాల్వంచలో ఎన్నికల రోజు ఉద్రిక్తత
- పోలీస్ స్టేషన్లో ఖాళీ బ్యాలెట్ బాక్స్ లభ్యం
- మూడు సంఘటనలతో రాజకీయ దుమారం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిది / పాల్వంచ, ఫిబ్రవరి 11, ప్రజా జ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా పాల్వంచలోని 27 డివిజన్ లలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసినప్పటికీ, అనంతరం జరిగిన పరిణామాలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఖాళీ బ్యాలెట్ బాక్స్ పోలీస్ స్టేషన్లో లభ్యం కావడం, దొంగ ఓటు యత్నంపై మహిళను స్టేషన్కు తరలించడం, కొందరి నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం వంటి ఘటనలు కలసి రాత్రి వరకు పాల్వంచ పోలీస్ స్టేషన్ లో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించాయి. అయితే ఇందులో ప్రధానంగా పోలీస్ స్టేషన్లో ఖాళీ బ్యాలెట్ బాక్స్ లభ్యం అవ్వడమే రాష్ట్ర స్థాయి చర్చ గా మారింది.

**దొంగ ఓటు ఆరోపణతో మొదలై..**

పాత పాల్వంచలోని ఒక పోలింగ్ కేంద్రంలో మహిళ దొంగ ఓటు వేసేందుకు యత్నించిందని ఆరోపిస్తూ పోలీసులు ఆమెను స్టేషన్కు తరలించారు. సుమారు నాలుగు గంటల పాటు ఆమెను స్టేషన్లో ఉంచినట్లు సమాచారం. ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సిపిఐ నాయకులు పోలీసులను ప్రశ్నించారు. మహిళను ఎందుకు ఇంతసేపు

మిగతా 2 లో...





## సింగరేణికి...
# నయా సీఎండి

- రెండు నెలల పరిపాలనా అనిశ్చితికి ముగింపు
- అదనపు చార్జ్ పాలనకు ఫుల్ స్టాప్
- సీనియర్ అధికారితో సింగరేణికి స్థిరత్వం
- నాయకత్వ లోటును భర్తీ చేసిన ప్రభుత్వం
- డా. జ్యోతి బుద్ధ ప్రకాశ్ కు పూర్తి స్థాయి బాధ్యతలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11, ప్రజాజ్యోతి :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో గత రెండు నెలలుగా కొనసాగుతున్న పరిపాలనా అనిశ్చితికి ముగింపు పలికే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి డా. జ్యోతి బుద్ధ ప్రకాశ్ ను సింగరేణి చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా నియమిస్తూ బుధవారం ఉదయం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సింగరేణి సిఎండి గా పని చేసిన ఎన్. బలరాం పదవీకాలం పూర్తయ్యాక కేంద్ర సర్వీసులకు వెళ్లిన నాటి నుంచి సంస్థలో పూర్తి స్థాయి నాయకత్వం టుగా మారింది. నిర్ణయాలు ఆలస్యం కావడం, విధాన పరమైన స్పష్టత తగ్గడం, పరిపాలనా స్థాయిలో గందరగోళం నెలకొనడం వంటి అంశాలు సంస్థ అంతర్గతంగా చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలో డి. కృష్ణ భాస్కర్, ఐఏఎస్, కొంత కాలం సిఎండి గా

మిగతా 2 లో...

## బ్యాలెట్ బాక్సుల తరలింపుపై
# బిఆర్ ఎస్ ఫిర్యాదు

- కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో అనుమానాలు..
- జిల్లా ఎన్నికల అధికారికి రేగా కాంతారావు లేఖ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిది, ఫిబ్రవరి 11, ప్రజా జ్యోతి :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల తరలింపుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ మేరకు టీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మిగతా 2 లో...

## కొత్తగూడెం కార్పొరేషన్ పై.. ప్రజాజ్యోతి ఎగ్జిట్ పోల్

- 60 డివిజన్లలో ఓటింగ్ ధోరణులపై అంచనా..

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిది (మాలోత్ అశోక్), ఫిబ్రవరి 11, ప్రజా జ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో జరిగిన పోలింగ్ నేపథ్యంలో ప్రజా జ్యోతి ప్రత్యేక ఎగ్జిట్ పోల్ నిర్వహించింది. ఓటర్ల స్పందనలు, స్థానిక పరిస్థితులు, అభ్యర్థుల బలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాలు సిద్ధం చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది. ఆ పార్టీకి 28 నుంచి 33 సీట్లు వచ్చే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ సూచిస్తోంది. సిపిఐ కూడా బలమైన ప్రదర్శన ఇచ్చినట్లు అంచనా. ఆ పార్టీకి 18 నుంచి 22 సీట్లు రావచ్చని విశ్లేషణ చెబుతోంది. టిఆర్ఎస్ కు పరిమిత స్థాయిలో విజయాలు దక్కే అవకాశం ఉందని అంచనా. ఆ పార్టీకి 3 నుంచి 5 సీట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు సూచిస్తోంది. సిపిఎంకు 2 స్థానాలు వచ్చే అవకాశం ఉందని అంచనా. బీజేపీ ఖాతా తెరవడం కష్టమని ఈ అంచనాలు చెబుతున్నాయి. అయితే స్వతంత్ర అభ్యర్థులు 1 నుండి 2 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని మా ఎగ్జిట్ పోల్ వెల్లడిస్తోంది.

**గమనిక: ఇవి ఎగ్జిట్ పోల్ అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు వెలువడిన తర్వాతే తుది చిత్రం స్పష్టమవుతుంది.**

### సీట్ల అంచనా – ప్రజా జ్యోతి ఎగ్జిట్ పోల్ (60 డివిజన్లు)

| | |
|---|---|
| కాంగ్రెస్ | : 28 - 33 |
| సిపిఐ | : 18 - 22 |
| టిఆర్ఎస్ | : 3 - 5 |
| సిపిఎం | : 1 - 2 |
| బీజేపీ | : 0 |
| స్వతంత్రులు | : 1 - 2 |

## సింగరేణికి నయా సిఎండి

(మొదటి పేజీ తరువాయి...)

అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. పరిమిత అధికారాల మధ్య కూడా సంస్థ కార్యకలాపాలు నిలిచిపోకుండా కొనసాగించడంలో ఆయన పాత్ర కీలకంగా నిలిచిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కేవలం బొగ్గు ఉత్పత్తి, ఆర్థిక లావాదేవీలు, రోజువారీ పరిపాలనా నిర్ణయాల్లో కనీస స్థిరత్వాన్ని కాపాడే ప్రయత్నం జరిగింది. అయితే అదనపు భాద్యత వ్యవస్థతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం సాధ్యం కాదన్న అభిప్రాయం కార్మిక సంఘాలు, పరిపాలనా వర్గాల నుంచి వ్యక్తమయ్యింది. దీంతో సింగరేణి వంటి భారీ ప్రభుత్వ రంగ సంస్థకు పూర్తి స్థాయి, సీనియర్ అధికారి అవసరమన్న డిమాండ్ బలపడింది. ఈ నేపథ్యంలోనే సంస్థ ఉనికిని కాపాడటం, భవిష్యత్ ఆర్థిక మరియు పారిశ్రామిక సవాళ్లను ఎదుర్కోవడం కోసం స్థిరమైన నాయకత్వం అవసరమన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే పరిపాలనా అనుభవం కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారి డా. జ్యోతి బుద్ధ ప్రకాశ్ ను ప్రభుత్వం పూర్తి స్థాయి సంస్థ అధినేతగా నియమించింది. అతనికి జిల్లా కలెక్టర్ గా, ఎన్నికల విభాగంలో, రవాణా శాఖలో, కాలుష్య నియంత్రణ మండలిలో, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఆ అనుభవం సింగరేణి పరిపాలన పునర్వ్యవస్థీకరణకు ఉపయోగపడుతుందన్న అంచనా వ్యక్తమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సింగరేణి కీలకమైన నేపథ్యంలో, ఈ నియామకం రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే పూర్తి స్థాయి సిఎండి నియామకంతో సంస్థలో స్థిరత్వం నెలకొంటుందా, గతంలో ఏర్పడ్డ పరిస్థితులకు చెక్ పడుతుందా అన్న అంశంపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## బ్యాలెట్ బాక్సుల తరలింపుపై బిఆర్ ఎస్ ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం నేరుగా స్ట్రాంగ్ రూమ్ కు తరలించాల్సి ఉండగా, ఆ ప్రక్రియలో మార్గమధ్య మళ్లింపులు చోటుచేసుకున్నాయని అయన లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల భద్రతా వ్యవస్థలో ఇది చిన్న విషయం కాదని, ప్రజాస్వామ్య ప్రక్రియపై నేరుగా ప్రభావం చూపే అంశమని అభిప్రాయపడ్డారు. **రేగా కాంతారావు లేఖలో ప్రస్తావించిన అంశాలు:** 1. స్ట్రాంగ్ రూమ్ కు వెళ్లాల్సిన ఎస్కార్ట్ వాహనం పాల్వంచ పోలీస్ స్టేషన్ కు మళ్లించబడిందని ఆరోపణ. 2. ఒక బ్యాలెట్ బాక్స్ ద్విచక్ర వాహనంపై పోలీస్ స్టేషన్ కు తరలించబడినట్లు అభ్యంతరం. 3. ఉదయం పోలింగ్ సామాగ్రి తీసుకెళ్లిన వాహనంలోనే సాయంత్రం బ్యాలెట్ బాక్సులు సరిపోలేదని చెప్పడం అనుమానాస్పదమని ప్రశ్న. 4. ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో 6 నుండి 7 ఖాళీ బ్యాలెట్ బాక్సులు ఎందుకు ఉన్నాయో వివరణ కోరడం. 5. రిటర్నింగ్ అధికారి ఇచ్చిన వివరణ నిబంధనలకు విరుద్ధమని అభ్యంతరం. 6. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ బాక్సుల మార్పిడి జరిగి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేయడం. ఈ అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రేగా కాంతారావు లేఖలో కోరారు. ఎన్నికల పారదర్శకతను కాపాడాలని, ఓటర్ల విశ్వాసం దెబ్బతినకుండా తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై జిల్లా ఎన్నికల అధికారుల స్పందన వెలువడాల్సి ఉంది. విచారణ దిశ ఎలా ఉండబోతుందన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## మునగాకు వల్ల ముఖ్యమైన ప్రయోజనాలు



మునగాకు (Moringa leaves) పోషకాల గని, దీనిని 'సూపర్ ఫుడ్' అని పిలుస్తారు. ఇందులో విటమిన్లు (A, C, B6), ఖనిజాలు (కాల్షియం, ఐరన్, పొటాషియం), యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యానికి, కళ్ళకు మరియు ఎముకల బలానికి చాలా మంచిది.

**పోషకాల గని:** మునగాకులో విటమిన్ A, C, B6, ప్రోటీన్, కాల్షియం, పొటాషియం మరియు ఇనుము వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.

**రోగనిరోధక శక్తి పెంపు:** ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో, ఇన్ ఫెక్షన్ లను తగ్గించడంలో సహాయపడుతుంది.

**మధుమేహ నియంత్రణ:** రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో మునగాకు సహాయపడుతుంది.

**జీర్ణక్రియ మెరుగుదల:** ఇందులో ఉండే అధిక డైటరీ ఫైబర్, మలబద్ధకాన్ని నివారించి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**గుండె ఆరోగ్యం & బీపీ:** అధిక రక్తపోటు మరియు కొలెస్ట్రాల్ ను తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**ఎముకల బలం & కంటి చూపు:** కాల్షియం మరియు ఫాస్పరస్ వల్ల ఎముకలు దృఢపడతాయి, విటమిన్ A వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది.

**యాంటీ ఇన్ఫ్లమేటరీ:** శరీరంలో వాపులు, నొప్పులను తగ్గించే గుణం ఉంది.

**వినియోగించే విధానం:** మునగాకును కూరగా, పప్పులో, వేపుడుగా, లేదా పొడిగా చేసుకుని అన్నం, జొన్నరొట్టె వంటి వాటితో తీసుకోవచ్చు. నిరంతర దగ్గు/జలుబుకు మునగాకు కారం పొడి నెయ్యితో మంచిది.

# పోలింగ్ ముగిసింది.. వివాదం మొదలైంది..

(మొదటి పేజీ తరువాయి...)

ఉంచారని అడగగా, సీఐ సతీష్ దురుసుగా ప్రవర్తించారని సిపిఐ నాయకులు ఆరోపించారు. దీనిపై వారు స్టేషన్లో బైఠాయించి నిరసన తెలిపారు. దీనితో పాటు బిఆర్ఎస్ కి సంభందించిన ఓ కులదూషణ ఫిర్యాదు కూడా అదే సమయంలో రావడంతో ఇక్కడ ఆ పార్టీ నాయకులూ అభ్యర్థులు కూడా ఇక్కడ భారీగా చేరుకున్నారు. టిఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేసిన డివిజన్ లో స్వతంత్ర అభ్యర్థి ఏజెంట్ ఒకరు టిఆర్ఎస్ అభ్యర్థిపై కులం పేరుతో దూషించారని ఫిర్యాదు నమోదు చేశారు. ఈ ఘటనతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది.

**పోలీస్ స్టేషన్లో ఖాళీ బ్యాలెట్ బాక్స్..**

ఎన్నికల అనంతరం అదనంగా ఉన్న ఏడు బ్యాలెట్ బాక్సులను స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కు తరలించారు. అయితే ఒక ఖాళీ బ్యాలెట్ బాక్స్ ఎస్కార్ట్ వాహనంలో మిగిలి, అది పోలీస్ స్టేషన్కు చేరినట్లు తెలిసింది. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏడు బాక్సులు రావాల్సి ఉండగా ఆరు మాత్రమే చేరినట్లు గుర్తించడంతో, మిగిలిన బాక్స్ ఎక్కడ ఉందని అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. తర్వాత అది ఎస్కార్ట్ వాహనంలో ఉన్నట్లు వెల్లడైంది. అయితే ఆ బాక్స్ ను వెంటనే స్ట్రాంగ్ రూమ్ కు తరలించకుండా పోలీస్ స్టేషన్లో ఉంచడం పలు అనుమానాలకు దారి తీసింది. ఖాళీ బాక్స్ అయినప్పటికీ అది పోలీస్ స్టేషన్లో ఎందుకు ఉండాల్సి వచ్చింది? ఇది పోలీసుల నిర్లక్ష్యమా? ఎన్నికల సిబ్బంది తప్పిదమా? లేక అధికారుల ఏమైనా ఉద్దేశపూర్వకమైన అంశాలా.. అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**నాయకుల రాకతో మరింత ఉత్కంఠ..**

ఆ సమయంలో స్టేషన్లో అప్పటికే దొంగ ఓటు ఆరోపణ, కులదూషణ ఫిర్యాదులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అక్కడే ఉండి అధికారులతో మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో ఖాళీ బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ కు చేరలేదని, అది స్టేషన్ ఆవరణలో ఉన్న ఎస్కార్ట్ వాహనంలో ఉన్నట్లు సమాచారం బయటకు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా మారింది. వెంటనే ఈ ఇద్దరు నాయకులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సామగ్రి స్టేషన్ ప్రాంగణంలో ఎలా మిగిలిందని, భద్రగారానికి చేరాల్సిన పెట్టె ఇక్కడ ఎందుకు ఉందని అధికారులను నిలదీశారు. ఇది చిన్న పొరపాటు కాదని, ఎన్నికల ప్రక్రియపై అనుమానం కలిగించే విషయం అని పేర్కొన్నారు. అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారంటూ అక్కడే ఆరోపణలు వినిపించాయి. వెంటనే పూర్తి వివరాలు వెల్లడించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రెండు అంశాలపై ఉద్రిక్తత కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఖాళీ బ్యాలెట్ బాక్స్ విషయం బయటపడటంతో అక్కడి వాతావరణం మరింత కఠినంగా మారింది.


### అనుమానాల వలయం..

వాస్తవానికి ఖాళీ బ్యాలెట్ బాక్స్ పోలీస్ స్టేషన్లో లభ్యం కావడం చిన్న విషయం కాదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశ కట్టుదిట్టమైన నియమావళి ప్రకారం జరగాల్సి ఉండగా, ఇలాంటి లోపాలు ప్రజల్లో అనుమానాలకు దారి తీస్తాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మూడు సంఘటనల నేపథ్యంలో పాల్వంచ పోలీస్ స్టేషన్లో రాత్రి 10; 30 గంటల వరకు ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు పూర్తి స్థాయి వివరణ ఇచ్చి పరిస్థితిని స్పష్టం చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. దీనిపై రాత్రే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు జిల్లా ఎన్నికల అధికారికి అధికారిక ఫిర్యాదు చేశారు. అయితే జిల్లాలో జరిగిన ఈ మున్సిపల్ ఎన్నికల పరిణామాలపై ఇప్పటికే ప్రజల్లో చర్చ మొదలైంది. ఈ ఎన్నికల దశలో కోట్ల రూపాయలు ఏరులై పారిన.. ఇప్పటి వరకు పోలీసులకు గానీ, ఇతర యంత్రాంగాలకు గానీ స్పష్టమైన పట్టింపులు లేకపోవడం కూడా ప్రశ్నలు రేకెత్తిస్తోంది. అదే సమయంలో ఖాళీ బ్యాలెట్ బాక్స్ పోలీస్ స్టేషన్లో కనిపించడం ఈ పరిస్థితిని మరింత సందేహాస్పదంగా మార్చింది. అధికార యంత్రాంగం తీరుపై, ముఖ్యంగా పోలీస్ విభాగం పాత్రపై కూడా కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా ఈ వ్యవహారంలో ఏవైనా లోపాలు జరిగాయా? లేక కేవలం పరిపాలనా నిర్లక్ష్యమేనా? అన్నది అధికారికంగా స్పష్టమవాల్సి ఉంది. పూర్తి స్థాయి విచారణ ద్వారానే ఈ అంశాలపై ఉన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

# కాల్షియం కోసం ఇప్పుడు చెప్పే ఫుడ్స్ హెల్ప్ చేస్తాయి, రెగ్యులర్ గా తింటే కాల్షియం లోపం రాదట









కాల్షియం అందాలంటే పాలు తాగాలని చాలా మంది పిల్లలకి ఉదయాన్నే పాలు తాగిస్తుంటారు తల్లులు. పిల్లలే కాదు పెద్దవారు కూడా కాల్షియం కోసం పాలు తాగుతుంటారు. వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది కాబట్టి వృద్ధులని పాలు తాగమని సజెస్ట్ చేస్తారు ఎక్స్ పర్ట్స్. పాలతో పాటు నాన్ వెజ్ ఐటెమ్స్ కూడా తీసుకుంటారు. వీటిని తీసుకోలేని వారికి కాల్షియం లోపం ఉంటుంది. అలాంటప్పుడు చాలా మంది కాల్షియం కోసం ట్యాబ్లెట్స్ వాడుతుంటారు. అయితే, ఈ రెండింటిలోనే కాదు ఇతర ఆహారపదార్థాల్లోనూ కాల్షియం ఉంటుంది. ఓ రకంగా చెప్పాలంటే పాలలో కంటే ఎక్కువగా కాల్షియం ఉంటుందని వాటి గురించి ఎక్స్ ప్లెయిన్ చేస్తున్నారు.

### ››› పాలలోనే కాల్షియం ఉంటుందనేది

పాలలోనే కాల్షియం ఉంటుందనేది చాలా మంది అనుకునే విషయం పాల ద్వారే కాల్షియం వస్తుందనుకుంటారు. అందరికీ ఉండే అపోహ పాలు తాగకపోతే కాల్షియం అందదు. కానీ, అందులో నిజం లేదంటున్నారు డాక్టర్. ఆవుపాలలో 100 మిల్లీలీటర్ల పాలలో 120 మిల్లీ గ్రాముల కాల్షియం అందుతుంది. అదే, గేదెపాలలో 100 మి.లీ 210 మిల్లీగ్రాముల కాల్షియం అందుతుంది. కానీ, చాలా ఫుడ్స్ లో అంతకంటే ఎక్కువగా చెప్పాలంటే రెట్టింపు, మూడింతల రెట్టింపు కాల్షియం అందుతుంది.

### ››› ఉలవల్లోనూ కాల్షియం

ఉలవల్ని రుచికోసం తీసుకుంటున్నాం అనుకుంటాం. కానీ, ఇది కాల్షియానికి బెస్ట్ సోర్స్. 100 గ్రాముల ఉలవల్లో దాదాపు 290 మిల్లీగ్రాముల కాల్షియం అందుతుంది. కాబట్టి, హ్యాపీగా వీటిని తీసుకోవచ్చు. కొంత మంది ఎప్పుడో తప్పితే ఉలవల్ని తీసుకోరు. అయితే, నాన్ వెజ్, పాలు తీసుకోలేని వారు కచ్చితంగా ఉలవల్ని రెగ్యులర్ గా తీసుకుంటే మీ కాల్షియం అవసరాలు తీరతాయి.

### ››› రాగుల్లో పుష్కలంగా కాల్షియం

రాగులు కూడా మంచి కాల్షియం రిచ్ సోర్స్. దాదాపు 100 గ్రాముల రాగుల్లో 350 మిల్లీ గ్రాముల కాల్షియం అందుతుంది. వీటిని చక్కగా జావలాగా, ఇడ్లీ, దోశలు, రొట్టెలు ఇలా ఎలా అయినా తీసుకోవచ్చు. వీటి వల్ల ఎముకలు ఉక్కులా మారతాయి. ముందుతరం వారు రాగుల్ని ఎక్కువగా తీసుకునేవారు. అందుకే, వారు ఇప్పటికీ స్ట్రాంగ్ గా ఉన్నారు. కాబట్టి, మీరు కూడా మీ డైట్ లో చక్కగా రాగుల్ని ఇంక్లూడ్ చేయండి.

### ››› తోటకూర కూడా బెస్ట్

తోటకూరలో కూడా పుష్కలంగా కాల్షియం ఉంటుంది. వీటిని తీసుకున్నప్పుడు 100 గ్రాముల తోటకూర తింటే దాదాపు 400 మిల్లీగ్రాముల కాల్షియం అందుతుంది. ఆకుకూరల్లో కాల్షియాన్ని అందించే వాటిలో తోటకూర ముందువరుసలోనే ఉంటుంది. హ్యాపీగా దీనిని కూడా మీ డైట్ లో భాగం చేసుకోండి.

### ››› మునగాకు ది బెస్ట్

అదే విధంగా, మునగాకు కూడా ది బెస్ట్ కాల్షియం రిచ్ సోర్స్ అని చెప్పొచ్చు. దీనిని తీసుకోవడం వల్ల మన బాడీకి అవసరమయ్యే కాల్షియం అవసరాలకి సరిపోతుంది. దాదాపు 100 గ్రాముల మునగాకులో 440 మిల్లీగ్రాముల కాల్షియం అందుతుంది. దీనిని మనం మునగాకు పప్పు, తాలింపు, పొడి ఇలా ఎన్ని రకాలుగా వీలైతే అన్నీ రకాలుగా తీసుకోవచ్చు.

### ››› కరివేపాకులో అధికంగా

కరివేపాకులో అధికంగా ఇది చాలా మందికి తెలియని విషయం. కూరల్లో వేయగానే చాలా మంది తీసి పక్కనపెట్టేస్తారు. కానీ, 100 గ్రాముల కరివేపాకులో 880 మిల్లీగ్రాముల కాల్షియం అందుతుంది. కాబట్టి, ఇక నుంచి కరివేపాకుని తీసి పారేయకుండా చక్కగా తినండి. దీనిని వంటల్లో వేయడంతో పాటు సెపరేట్ గా పొడి, పచ్చళ్ళలా చేసుకుని తినొచ్చు.

### ››› అవిసె ఆకులు

అవిసె ఆకుల గురించి తెలియకపోవచ్చు. కానీ, ఇవి కూడా కాల్షియాన్ని అందించే సూపర్ ఫుడ్. దాదాపు 100 గ్రాముల అవిసె ఆకుల్లో 1200 మిల్లీగ్రాముల కాల్షియం అందుతుంది. కాబట్టి, హ్యాపీగా వీటిని తీసుకోండి. వీటిని నేరుగా తినలేని వారు పప్పు కాంబినేషన్ తో వండుకోవడం బెటర్ ఆప్షన్.

### ››› నల్ల నువ్వులు

నువ్వులు ముఖ్యంగా నల్లనువ్వుల్లో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. 100 గ్రాముల నువ్వుల్లో 14 50 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటుంది. కాబట్టి, వీటిని హ్యాపీగా తీసుకోవచ్చు. పొడిలా చేసి తినొచ్చు. అదే పొడిని కూరల్లో వేయొచ్చు. పచ్చల్ళు చేయొచ్చు. స్నాక్స్ చేసి తినొచ్చు. నేరుగానైనా తినొచ్చు. ఇన్ని సోర్సెస్ ఉన్నాయి. కాబట్టి, హ్యాపీగా తిని కాల్షియాన్ని అందుకోవచ్చు.

# కొరకటపాడులో వైద్య శిబిరం



**చర్ల, ఫిబ్రవరి 11(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కొరకటపాడు గ్రామంలో డాక్టర్ నగేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.గ్రామంలో ఇంటింటికి రాపిడ్ ఫీవర్ సర్వే చేస్తూ డ్రై డే కార్యక్రమాలు చేసారు.డాక్టర్ నగేష్ మాట్లాడుతూ జ్వరాలు వస్తే అశ్రద్ధ చెయ్యకుండా పి హెచ్ సి రావాలి అని అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయి అని అలాగే ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీళ్లు నిల్వలేకుం డా చూసుకోవలని దోమ తెరలను వినియోగించుకోవాలని ఎల్లపుడు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని అన్నారు. ఈ వైద్య శిబిరంలో జ్వరం తో బాధపడుతున్న ముగ్గురికి ఆర్ డి టి మలేరి యా పరీక్షలు చేయగా వారికి మలేరి యా లేదని నిర్ధారించి వారికి మాము లు జ్వరంకు సంభందించిన మందు లు ఇచ్చారు.గర్భిణీ స్త్రీలకు వైద్య పరిక్షలు నిర్వహించి 42 మందికి సాధారణ వ్యాధులకు మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నగేష్ మెడికల్ ఆఫీసర్,బాబురావు హెచ్ ఈ ఓ, కవిత ఏ ఎన్ ఎమ్, వరప్రసాద్ హెల్త్ అసిస్టెంట్ పాల్గోన్నారు.

## అంగన్వాడీ కేంద్రం తనిఖీ

- పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలి
- లింగాపురం సర్పంచ్ గుగులోతు మంగ





**చర్ల, ఫిబ్రవరి 11 (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో బుధవారం లింగాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంను సర్పంచ్ గుగులోతు మంగ తనిఖీ చేసారు .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ లకు పంచాయతీ లోని అంగనవాడి కేంద్రాలను పర్వేక్షించాలని ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో బుధవారం లింగాపురం పాడు గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంను సందర్శించి అంగన్వాడీలోని పిల్లల రిజిస్టర్, స్టాక్ వివరాలు వారి యోగ క్షేమాలు మెనూ వివరాలు తెలుసుకొని పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలని పిల్లలు పూర్తిస్థాయిలో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఉపాధ్యాయురాలి డిప్టేషన్ వెంటనే రద్దు చెయ్యాలి

- పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు ముసలి సతీష్




**చర్ల, ఫిబ్రవరి 11(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం కుర్నపల్లి పంచాయతీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సాంగిక శాస్త్రం భోదించే ఉపాధ్యాయురాలు శ్రీదేవిని మంగళవారం డిప్టేషన్ మీద దమ్మపేట మండలం కు పంపించారు అని తక్షణమే జిల్లా అధికారులు స్పందించి ఉపాధ్యాయురాలు శ్రీదేవి డిప్టెషన్ రద్దు చెయ్యాలని పీవైఎల్ ప్రగతిశీల యువజన సంగం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ ముసలి సతీష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఏజెన్సీలో మారుమూల గ్రామాలలో ఉన్న పాఠశాలలలో విద్య అందని ద్రాక్షగా మారిందని ఏజెన్సీలో ఉపాధ్యాయులను డిప్టెషన్ పై పంపడం సరికాదని గత సంత్సరకాలంగా కుర్నపల్లి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు కూడా లేరని ఇది కేవలం ఏజెన్సీలో మారుమూల గ్రామలపై ఏంఈఓ లోపం అని ఆయన అన్నారు. అధికారులు ఇష్టాను సారంగ ఏజెన్సీ నుండి డిఈఓ నాగలక్షి విద్యా చైర్మన్ అనుమతి లేకుండా ఇష్టను సారంగా ఉపాధ్యాయులను డిప్టెషన్ చేస్తున్న డిఈఓ పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పీ డి ఎస్ యు పీవైఎల్ గా డిమాండ్ చేస్తున్నాము అని తక్షణమే సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులను, హిందీ ఉపాధ్యాయులను నియమించాలని లేనియెడల కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యాక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్య చైర్మన్ కుర్నపల్లి గ్రామస్తులు విద్యార్థులు , తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సంచార వైద్యశాల ఆకస్మిక తనిఖీ

- ప్రభుత్వ వైద్యశాల పై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- డిప్యూటీ డిఏం అండ్ హెచ్ ఓహ్ డాక్టర్ శ్రీధర్





**చర్ల, ఫిబ్రవరి 11(ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో బుధవారం డిప్యూటీ డిఏం అండ్ హెచ్ ఓహ్ డాక్టర్ శ్రీధర్ పూసుగుప్ప లోని సంచార వైద్యశాల ను ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ జరుగుతున్నటువంటి వైద్య సేవలను పరిశీలించారు. అన్ని రిజిస్టర్లు పరిశీలించి వ్యాధి గ్రస్తులకి జరుగుతున్న వైద్యసేవలు అడిగి తెలుసుకున్నారు.మారు మూల ప్రాంతం అయిన పుసుగుప్పలో ఉన్నటువంటి ఈ మొబైల్ హాస్పిటల్ వలన చాలా మంది నిరుపేదలు వైద్యసేవలు పొందుతున్నారు.పుసుగుప్ప చుట్టుపక్కల గ్రామాలే కాక ఛత్తీస్గఢ్ రాష్ట్రం వాళ్ళు ఎక్కువగా వైద్య సేవలు పొందుతున్నారు .అనంతరం వెంకటచెరువు గ్రామం సందర్శించి జ్వరం తో బాధపడుతున్న వారికి తగు జాగ్రత్తలు చెప్పారు .వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది మారుమూల ప్రాంతాలను ,మలేరియా ప్రభావిత ప్రాంతాలను ప్ర తి రోజు వైద్యసిబ్బంది ఆశ కార్యకర్తలు సందర్శించి ఫీవర్ సర్వే చేయాలని ఎవరైనా ఫీవర్ తో బాధ పడుతుంటే రక్త పరీక్షలు చేసి వైద్యం అందించాలి అని ఇబ్బంది ఉన్నవాళ్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి పంపించాలని ప్రజల్లో ఫ్రైడే డ్రై డే మీద అవగాహన కల్పించాలని,అందరు దోమ తెరలు ఉపయోగించుకునే లా అవగాహన కల్పించాలని పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత మీద ప్రజల్లో అవగాహన కల్పించాలని ఏ ఒక్కరు కూడా ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్ళి నష్టపోవద్దు అని మన చర్ల లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (కొయ్యూరు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అందుబాటులో ఉన్నాయి అని ఈ రెండు వైద్యశాలలో అన్ని రకాలవ్యాధులకు పరీక్షలు,అన్ని రకాల మందులు ఉన్నాయి గనుక ప్రభుత్వ వైద్యశాల పై ప్రజల్లో పఅవగాహన కల్పించాలని అన్నారు . డాక్టర్ హారిక వైద్యాధికారి ప్రాథమిక కేంద్రం చర్ల, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ గీత , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురి తప్పని ప్రతిభ... సీఎం కప్ అర్చరీలో లోహితశ్రీ కి స్వర్ణం

- అభినందనలు తెలిపిన పైడి

**దమ్మపేట,ఫిబ్రవరి. 11,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం పట్వారీగూడెం గ్రామానికి చెందిన కనకం లోహిత శ్రీ అర్చరీ క్రీడలో ప్రతిభ చాటుతూ జిల్లా స్థాయిలో సంచలనం సృష్టించారు. పాల్వంచలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ అర్చరీ పోటీల్లో మహిళల విభాగంలో ఆమె అద్భుత ప్రదర్శన కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. తన గురి తప్పని అస్త్రాలతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు.గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన లోహిత శ్రీ క్రమశిక్షణతో కూడిన కఠోర సాధన ఫలితంగా ఈ ఘనత సాధించడం గర్వకారణమని దమ్మపేట మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, కోయ్యల అచ్యుతరావు హర్షం వ్యక్తం చేశారు. ఆమె విజయాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ విజయంతో లోహిత శ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పట్వారీగూడెం గ్రామానికి జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఆమెను పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, క్రీడాకారులు అభినందించారు.





## ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు పంపిణీ



**టేకులపల్లి, ఫిబ్రవరి11, ప్రజా జ్యోతి:** మండల కేంద్రంలోని టేకులపల్లి పంచాయతీ కార్యాలయం నందు ఉపాధి హామీ కూలీలకు బుధవారం టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్ చేతుల మీదుగా పనిముట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 30 గ్రూపులకు 30 గడ్డపారలు, 60 పారలు, 90 బొచ్చలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉపాధి హామీ కూలి రేట్లు పెరిగినందున్న,ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్నవారు ఎవరు వృధా చేసుకోవద్దని ఆయన తెలిపారు. అలాగే ఊర్లో ఖాళీగా ఉన్నవారు కూడా ఉపాధి హామీ పనులకు దరఖాస్తు చేసుకొని ఉపాధి హామీ పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి,ఉప సర్పంచ్ వసంత,వార్డు సభ్యులు జీజ,సుజాత,రామకృష్ణ, కిరణ్,గణేష్,ఉషా,కోక్యా, కోటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

## నేటి కార్మిక చట్టాల పరిరక్షణ సమ్మెను జయప్రదం చేయండి

- ఐ ఎఫ్ టి యు పిలుపు




**టేకులపల్లి,ఫిబ్రవరి11, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల రద్దు చేయాలని నూతన వ్యవసాయ చట్టాలను నూతన విద్యుత్ బిల్లును ఉపసాగించుకోవాలని తదితర డిమాండ్లతో నేటి దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం టేకులపల్లి పార్టీ కార్యాలయంలో దేశవ్యాప్త సమ్మె విజయవంతం కోరుతూ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ సమ్మెలో సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం బాధ్యతగా విధిగా స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని నిరసనను పాలకులకు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.కార్మికులు తమ విధులను బహిష్కరించి ఈ సమ్మెలో పాల్గొనాలని ఆయన తెలిపారు. సమ్మెలో బ్యాంకు, సింగరేణి,గ్రామపంచాయతీ, భవన నిర్మాణ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ అంగన్వాడి, మిషన్ భగీరథ తదితర అత్యవసర విభాగాల కార్మికులు పాల్గొని దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి ఆయన కోరారు.ఎన్నో ఏళ్లగా కార్మికులు కొట్లాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్లకు రెడ్ నైట్ వేసి వారి కి అనుకూలంగా చట్టాలను మార్చి కార్మిక వర్గం చమటను పీల్చే విధంగా సవరణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్మికుల ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న స్వేచ్ఛను హరించకూడదని ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం. బిచ్చు, ఈ.మహేష్, మంచ,కె.వెంకన్న ఎం.వినోదు,జి.రామారావు,కె. ఎర్రయ్య,క్రాంతి కుమార్,జె. వెంకన్న, జె.తార్య . వెంకటేశ్వర్లు,భాస్కర్ అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ నిరసనకు పిలుపు

- టిఎన్టియుసి అధ్యక్షులు కనకమెడల హరిప్రసాద్

**బూర్గంపహాడ్,ఫిబ్రవరి 11, (ప్రజా జ్యోతి ):** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మెకు గురువారం ఉదయం 8 గంటలకు ఐటిసి భద్రాచలం యూనిట్ లో నిరాహార దీక్ష,నిరసన కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు బూర్గంపహాడ్ మండల పరిధిలో ఐటిసి కర్మాగార అధికార కార్మిక సంఘం టిఎన్టియుసి అధ్యక్షులు కనకమెడల హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్మాగార పరిధిలోని పిఎం 6 గేటు వద్దకు ఉదయం ఎనిమిది గంటలకు కార్మికులంతా ఏకమై రావాలని అన్నారు.ఈ కార్యక్రమానికి మిత్రపక్షాలు, అఖిలపక్షాలు (బిఎంఎస్ మినహాయించి ) మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- తుది పోలింగ్ శాతం 73.60% నమోదు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 11, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు సంబంధించిన 2వ సాధారణ ఎన్నికల పోలింగ్ ఈ రోజు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, అశ్వరావుపేట మర, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 106 వార్డులకు పోలింగ్ నిర్వహించబడింది. ఎన్నికల ప్రక్రియ మొత్తం సజావుగా కొనసాగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,85,348 మంది ఓటర్లలో 1,36,423 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 73.60 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. పురుష ఓటర్లలో 73.70 శాతం, మహిళా ఓటర్లలో 73.51 శాతం, ఇతర వర్గాల్లో 78.95 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందకరమని కలెక్టర్ అన్నారు. మున్సిపాలిటీ వారీగా పరిశీలిస్తే అశ్వరావుపేట మున్సిపాలిటీలో 16,830 మంది ఓటర్లలో 12,849 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 76.28 శాతం పోలింగ్ నమోదు కాగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 1,00,453 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 74.53 శాతం పోలింగ్ నమోదైంది. ఇల్లందు మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,121 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 68.56 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిందని, పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ప్రతి ఓటరికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికార యంత్రాంగం, పోలీస్ సిబ్బంది, ప్రజలందరికీ జిల్లా ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

## 14.600 కేజీల ఎండు గంజాయి స్వాధీనం



**కొత్తగూడెం, ఫిబ్రవరి 11, ప్రజాజ్యోతి:** భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 14.600 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కూనవరం రోడ్డులోని ఆర్‌టీఓ కార్యాలయం ఎదురుగా వాహనాల తనిఖీలు చేపట్టిన అధికారులు, అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఒక కారు, ఒక స్కూటీని ఆపి తనిఖీ చేశారు. టీఎస్ 10 ఈయు 0558 నంబర్ గల బాలెనో కారు, హోండా యాక్టివా స్కూటీపై ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. విచారణలో ఈ మత్తు పదార్థాన్ని ఒడిశా రాష్ట్రంలోని కలిమెల ప్రాంతం నుంచి సూర్యాపేట, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో సూర్యాపేట జిల్లా ఫణిగిరి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్, మహమ్మద్ ఇష్కాకర్, సికింద్రాబాద్‌కు చెందిన నీర్ల అంజన్ కుమార్, తోటపల్లి గోపి, తోటపల్లి దిశ్వంత్ రెడ్డి అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు ఒక కారు, ఒక స్కూటీ, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1 1 లక్షల 5 వేల రూపాయలు ఉంటుందని ఎక్సైజ్ ఎస్సై శ్రీహరి రావు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎ. కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, వీరబాబు పాల్గొన్నారు.

**గమనిక:** గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నంబర్ 18004252523 కు సమాచారం అందించాలని ఎక్సైజ్ అధికారులు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 11, ప్రజా జ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో జగ్గు తండ ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మన గళాన్ని వినిపించడానికి ఓటు హక్కు శక్తివంతమైన సాధనం అని అన్నారు.






ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు, అవసరమైన సిబ్బంది నియామకం వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వృద్ధులు, వికలాంగులు మరియు ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్లకోసం వీల్‌చైర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అన్ని వర్గాల ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఇల్లందులో 68.56 శాతం పోలింగ్
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు







**ఇల్లందు, ఫిబ్రవరి 11, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. ఇల్లందులో 33,723 ఓట్లలో పురుషులు 16,222, మహిళలు 17,497, ఇతరులు నలుగురు ఉన్నారు. వీటిలో పురుషులు 11,152, మహిళలు 11,965, ఇతరులు నాలుగు ఓట్లను వినియోగించుకున్నారు. మొత్తం 33,723 ఓట్లకు 23,121 ఓట్లతో 68.56 శాతం పోలింగ్ నమోదైంది. 24 వార్డులకు గాను 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 260 మంది పోలింగ్ సిబ్బందితోపాటు 200కు పైగా పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఉదయం నుండి పోలింగ్ బూతుల వద్ద జనాలు బారులు తీరకుండానే వచ్చి ఓట్లు వేసి వెనుతిరిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు పర్యవేక్షణలో ఇల్లందు, టేకులపల్లి సీఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బందితో భారీ బందోబస్తు చేపట్టారు. అదేవిధంగా పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజు పరిశీలించి పోలింగ్, బందోబస్తు గురించి ఇల్లందు డిఎస్పిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, జనాలు గుంపులు గుంపులుగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని, అలాంటి విషయాలపై ఏమైనా సమాచారం అందితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## 73.60% పోలింగ్‌తో.. ముగిసిన మున్సిపల్ పోరు

- కొత్తగూడెం కార్పొరేషన్‌లో 74.53%
- అశ్వరావుపేటలో అత్యధికంగా 76.28%
- ఇల్లందులో 68.56% పోలింగ్ నమోదు









**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 11, ప్రజాజ్యోతి:** జిల్లాలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1,85,348 మంది ఓటర్లలో 1,36,423 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 73.60 శాతం పోలింగ్ నమోదు అయింది. గత కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపిన ఎన్నికల ప్రక్రియ, ఎటువంటి పెద్ద సంఘటనలు లేకుండా సజావుగా సాగింది. పురుష ఓటర్లలో 73.70%, మహిళా ఓటర్లలో 73.51%, ఇతర వర్గాల్లో 78.95% పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీ కనిపించింది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగగా, క్యూలో ఉన్న ప్రతి ఓటరికి అవకాశం కల్పించారు. జిల్లాలో అత్యంత కీలకంగా భావించిన కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మొత్తం 1,34,775 మంది ఓటర్లలో 1,00,453 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో ఇక్కడ 74.53 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ త్రిముఖ పోటీ అని అందరు ఊహించిన చివరకు బీఆర్ఎస్ కొన్ని చోట్ల సిపిఐతో జత కట్టింది. దీంతో ఈ పోరు ద్విముఖ పోరు గా మారింది. ఈ నేపథ్యంలో ఈ శాతం ఫలితాలపై కీలక ప్రభావం చూపనుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అశ్వరావుపేటలో పోలింగ్ ఉత్సాహం మరింతగా కనిపించింది. మొత్తం 16,830 మంది ఓటర్లలో 12,849 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 76.28 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోనే అత్యధిక పోలింగ్ ఇక్కడే నమోదు కావడం గమనార్హం. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 33,723 మంది ఓటర్లలో 23,121 మంది ఓటు వేశారు. దీంతో 68.56 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మిగిలిన రెండు ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ పోలింగ్ శాతం కొంత తక్కువగా ఉంది. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీల దృష్టి ఫలితాలపైనే ఉంది. జిల్లాలో నమోదైన 73.60 శాతం పోలింగ్ ఏ పార్టీకి అనుకూలంగా మారనుందన్నది ఫలితాల రోజునే తేలనుంది.

# పాల్వంచ పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత





- స్టేషన్ ఆవరణ లో బైఠాయించిన ఎం ఎల్ ఏ
- స్టేషన్ ను ముట్టడించిన ఎమ్మెల్యే, సిపిఐ శ్రేణులు



**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 11,ప్రజా జ్యోతి:** పట్టణ పరిధి లోని పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా ఒక మహిళ దొంగ ఓటు వేశారని ఆరోపిస్తూ, అ మహిళను పోలీసులు, పోలీస్ స్టేషన్ కు తరలించారు. అయితే గంటల తరబడి స్టేషన్ లో అట్టి మహిళ ను నిర్బంధించిన విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా స్థానిక సీఐ సతీష్ ను ప్రశ్నించడం తో అతని పట్ల సీఐ సతీష్ దురుసుగా ప్రవర్తించారన్న, విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ శ్రేణుల తో కలిసి స్టేషన్ ను ముట్టడించారు. తమ పార్టీ నాయకుడితో దురుసు గా ప్రవర్తించిన సిఐ సతీష్ క్షమాపణ చెప్పే వరకు కదిలేది లేదని పేర్కొంటూ ఎమ్మెల్యే స్టేషన్ ఆవరణ లోనే బైఠాయించారు. డీఎస్పి సతీష్ కుమార్ హుటాహుటిన స్టేషన్ కు చేరుకొని ఎం ఎల్ ఏ కూనంనేని తో చర్చలు జరుపు తున్నారు. ఎట్టకేలకు సీఐ తరుపున డిఎస్పి సర్ది చెప్పడంతో ఘర్షణ వాతావరణం సద్దు మణిగినట్లు అయింది.

## 12న దేశవ్యాప్త సమ్మె కార్మిక, రైతు సంఘాల పిలుపు

- టీయూసీఐ, ఏఐయూకేఎస్, ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో గోడపత్రాల ఆవిష్కరణ




**దమ్మపేట,ఫిబ్రవరి. 11,(ప్రజాజ్యోతి):** ఈ నెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ, అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్), అఖిలభారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) దమ్మపేట మండల కమిటీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు దమ్మపేటలోని సిపిఎంఎల్ మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కేసరి వెంకటేష్, పందూరి వీరబాబు, కురసం ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, పీఎఫ్, ఈపీఎఫ్, గ్రాట్యుటీ, బోనస్ వంటి సంక్షేమ అంశాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.రైతు వ్యతిరేక విధానాలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నూతన విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, క్యాజువల్ కార్మికులను శాశ్వతం చేయాలని తెలిపారు.సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మేధావులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తామ రాముడు, కుంజ కాంతారావు, సున్నం జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పెనుబల్లి వారి ఓణీల అలంకరణ వేడుకలో మాజీ జడ్పీటీసీ పైడి



**దమ్మపేట,ఫిబ్రవరి. 11,(ప్రజాజ్యోతి):** మండలంలోని కోడేశలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి శ్రీనివాస్–జ్యోతి దంపతుల కుమార్తెలు జ్యోష్ణ, దీక్షల ఓణీల అలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు హాజరై చిన్నారులను దీవించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఏఎంసి చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, కట్టం ఎర్రప్ప కుటుం బ సభ్యులు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు.గ్రామ పెద్దలు,బంధుమిత్రులు సమక్షంలో వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

## ఖాతాలు సక్రమంగా ఉండాలంటే కేవైసీ తప్పనిసరి

- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్ బీఐ మేనేజర్ సుధాకర్




**దమ్మపేట,ఫిబ్రవరి. 11,(ప్రజాజ్యోతి):** బ్యాంక్ ఖాతాదారులు తమ ఖాతాలు నిరంతరాయంగా కొనసాగాలంటే కేవైసీ, సికేవైసీ, రీ–కేవైసీ ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దమ్మపేట బ్రాంచ్ మేనేజర్ కే. సుధాకర్ సూచించారు.మంగళవారం మండలంలోని మందలపల్లి, పెద్ద గొల్లగూడెం, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ వీక్' సందర్భంగా కేవైసీ అప్డేట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవైసీ నవీకరణ ద్వారా ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు సరిచేయబడటంతో పాటు లావాదేవీలకు ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. ప్రతి ఖాతాదారుడు సమయానికి రీకేవైసీ పూర్తి చేయడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.60 సంవత్సరాల లోపు ఉన్న వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలలో చేరి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీల సమయంలో అపరిచిత లింకులు, కాల్స్ కు స్పందించవద్దని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మందలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, సెక్రటరీ గోపి, పోస్టల్ అధికారిణి శ్రావ్య, ఎఫ్ ఎల్ సీ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సహజ నూనెలతో సస్యరక్షణపై అవగాహన

- మంత్రి తుమ్మలను కలిసిన ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు పొన్నుస్వామి




**దమ్మపేట,ఫిబ్రవరి. 11,(ప్రజాజ్యోతి):** సహజ నూనెల ఆధారంగా రైతులకు సస్యరక్షణ పద్ధతులను తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమిళనాడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు పొన్నుస్వామి మంగళవారం ఉదయం పాకలగూడెం వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సహజ నూనెల వినియోగం ద్వారా పంటలను రసాయనాల నుండి రక్షించుకోవచ్చని, రైతులకు తక్కువ వ్యయంతో అధిక లాభాలు సాధించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు.రైతులకు సేంద్రీయ, సహజ వ్యవసాయ పద్ధతులపై మరింత అవగాహన కల్పించేందుకు సంయుక్తంగా కార్యక్రమాలు చేపట్టాలని చర్చించారు.